www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 30 నవంబర్ 2025
5
ఏలూరు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

టి.నరసాపురం సొసైటీ ఛైర్మన్ సోంబాబు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మక్కినవారిగూడెం సొసైటీ ఛైర్మన్ జోనుబోయిన సోంబాబు అన్నారు. మండల కేంద్రమైన టి.నరసాపురం సొసైటీ ఆధ్వర్యాన స్థానిక సొసైటీ గొడౌన్‌లో రైతు సేవా కేంద్రం ద్వారా నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే పండించిన ధాన్యాన్ని అమ్మడం శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో సొసైటీ పర్సన్స్ మోదుగు రామారావు, ఉయ్యూరు నాగమణి, రాచబంటు వేములయ్య, కొనకల్ల మోహన్, పెద్దిన సత్యనారాయణ, అద్దంకి జగ్గారావు, బైగాని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'దిత్వా' దిగులు..!

తుపాన్ హెచ్చరికలతో రైతులు ఉరుకులు పరుగులు

ముమ్మరంగా ఖరీఫ్ మాసూళ్లు

రెండు జిల్లాల్లో 4.25 లక్షల ఎకరాల్లో వరిసాగు

ఇప్పటి వరకూ 1.75 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తి

2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

టార్పలిన్లు అందజేతలో తాత్సారం

ధాన్యం ఆరబెడుతున్న రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అన్నదాత తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు. దిత్వా తుపాన్ హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. తుపాను ఈ నెల 30న తమిళనాడు, దక్షిణ కోస్తా తీరానికి చేరే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఖరీఫ్ మాసూళ్లు త్వరగా పూర్తి చేసేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏలూరు జిల్లాలో 2.07 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇప్పటికి 95 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తవ్వగా లక్షా 45 వేల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు పూర్తయ్యింది. దాదాపు ఇంకా లక్షకుపైగా ఎకరాల్లో కోతలు కోయాల్సి ఉంది. అధికారుల అంచనా ప్రకారం దాదాపు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, పంట కళ్లాల్లోనే ఉంది. పశ్చిమలో 2.19 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇప్పటి వరకూ 75 వేల ఎకరాల్లో రైతులు వరికోతలు పూర్తి చేశారు. అధికారుల లెక్కల ప్రకారం లక్షా 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. రెండు జిల్లాల్లోనూ 2.50 లక్షల ఎకరాల్లో కోతలు కోయకుండా, కళ్లాల్లో ధాన్యం రూపంలో ఉంది. దాదాపు తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో తుపాన్ ప్రభావంతో వర్షాలు కురిస్తే రైతులు తీవ్ర నష్టాలను చవిచూసే పరిస్థితి ఏర్పడనుంది. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.35 వేలకుపైగా పెట్టుబడులు పెట్టారు. మొంథా తుపాన్ ప్రభావంతో దిగుబడులు తగ్గిపోయాయి. సంపత్ స్వర్ణ రకం ఎకరాకు 35 బస్తాల్లోపే దిగుబడి వస్తోంది. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు తుపాన్ ప్రభావంతో వర్షాలు కురిస్తే రైతులకు దిక్కుతోచని పరిస్థితి రానుంది. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు వేగంగా సాగుతున్నాయి. ధాన్యం సొమ్ము సైతం 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో జమవుతుంది. మరో వారం, పది రోజులు ఆగితే ఖరీఫ్ మాసూళ్లు దాదాపు పూర్తయ్యే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో తుపాన్ హెచ్చరికలు అన్నదాతను బెంబేలెత్తిస్తున్నాయి.

కౌలురైతుల పరిస్థితి అత్యంత ఘోరం

రెండు జిల్లాల్లో 80 శాతం సాగు కౌలురైతులే చేశారు. ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు 15 నుంచి 17 బస్తాల వరకూ కౌలు చెల్లించాల్సి ఉంది. అక్టోబర్ చివరి వారంలో విరుచుకుపడిన మొంథా తుపానుతో రెండు జిల్లాల్లో 33 వేల ఎకరాల్లో రైతులు పంటను కోల్పోయినట్లు అధికారులు లెక్కలుగట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేల ఎకరాలు ఉండగా, ఏలూరు జిల్లాలో 12,560 ఎకరాల వరకు పంటనష్టం వాటిల్లింది. 33 శాతానికిపైగా పంట దెబ్బతిన్న పొలాలనే అధికారులు లెక్కల్లోకి తీసుకున్నారు. 30 శాతం వరకూ దెబ్బతిన్న పొలాలు సైతం పెద్దఎత్తున ఉన్నాయి. దెబ్బతిన్న పంటలకు సంబంధించి అధికారులు నివేదించిన జాబితాలో సాగు చేసిన కౌలురైతుల పేర్లు లేవు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న భూయజమానుల పేర్లను నమోదు చేశారు. పెట్టుబడి పెట్టిన కౌలురైతుకు నష్టపరిహారం అందే పరిస్థితి లేకుండాపోయింది. పొట్ట, ఈనిక దశలో మొంథా తుపాను రావడంతో గింజలు పాలుపోసుకుని పరిస్థితి ఏర్పడింది. దీంతో పలు ప్రాంతాల్లో ఎకరాకు 20 బస్తాల దిగుబడి కూడా రాని పరిస్థితి ఉంది. కౌలుపోను ఎకరాకు ఐదు బస్తాలు కూడా కౌలురైతులకు మిగలని దుస్థితి. ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన కౌలురైతులకు దిత్వా తుపాన్ హెచ్చరికలతో గుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయి. సాగు చేస్తున్న కౌలురైతులను ప్రభుత్వం ఆదుకోకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. దిత్వా తుపాను జిల్లాపై ప్రభావం చూపితే కౌలురైతులు పూర్తిగా రోడ్డున పడనున్నారు.

టార్పలిన్ల అందజేతపై తాత్సారం

వర్షాలు కురిస్తే ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు టార్పలిన్లు ఉచితంగా అందిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతున్నారు. ప్రతి రైతుసేవా కేంద్రంలో 25 వరకూ టార్పలిన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కౌలురైతులకు మొదటి ప్రాధాన్యత అని సైతం చెప్పారు. ఇప్పటి వరకూ టార్పలిన్లు అందించలేదని రైతులు చెబుతున్న పరిస్థితి ఉంది. టార్పలిన్లు త్వరితగతిన అందించాలని రైతులు కోరుతున్నారు. వర్షం కురిస్తే ధాన్యం కాపాడుకునేందుకు రైతులు ముందుగానే సిద్ధంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది.

రేపు సిఎం పర్యటన సాగేదిలా



ప్రజాశక్తి - ఏలూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు డిసెంబర్ ఒకటో తేదీన జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లి నుండి హెలీకాప్టర్‌లో బయలుదేరి 10.55 గంటలకు ఉంగుటూరు మండలం గొల్లగూడెం చేరుకుంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులను కలుసుకుంటారు. 11.10 గంటలకు గొల్లగూడెం నుండి బయలుదేరి గోపీనాథపట్నం చేరుకుని, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తారు. ఆయా కుటుంబాలతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. 11.40 గంటలకు గోపీనాథపట్నం నుండి బయలుదేరి, నల్లమాడ చేరుకుని ప్రజావేదిక బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు నల్లమాడ నుండి బయలుదేరి, 2.05 గంటలకు గొల్లగూడెం చేరుకుని పార్టీ నేతల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 3.35 గంటలకు గొల్లగూడెం నుండి బయలుదేరి 3.40 గంటలకు హెలీప్యాడ్ చేరుకుంటారు. 3.45 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఉండవల్లి బయల్దేరి వెళ్తారు.

చేబ్రోలు-దూబచర్ల మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు

ఉంగుటూరు: డిసెంబర్ 1న ముఖ్యమంత్రి గొల్లగూడెం పర్యటన నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. చేబ్రోలు రైల్వే గేట్ నుండి దూబచర్ల, దూబచర్ల నుండి చేబ్రోలు మార్గంలో ప్రయాణించే భారీ వాహనాలు, సరుకుల వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాల్సి ఉంది. సాధారణ పౌరులు, ద్విచక్ర వాహనాలు, ఆర్‌టిసి బస్సుల రాకపోకలు యధావిధిగా సాగుతాయని నిడమర్రు సిఐ రజనికుమార్, చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులూ.. బాలోత్సవంలో పాల్గొనండి: డిఇఒ

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి బాలోత్సవం పిల్లల సంబరాలు-6 కార్యక్రమానికి జిల్లాలోని రెండో తరగతి నుండి పదో తరగతి వరకు విద్యార్థులను పంపి జయప్రదం చేయాలని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. హేలాపురి బాలోత్సవం నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, అకడమిక్ అంశాల సమన్వయకర్త, రిటైర్డ్ ఎంఇఒ కె.శ్రీనివాసరావు, నిర్వాహక కమిటీ సభ్యులు జి.రాంబాబు శనివారం డిఇఒను కలిసి బాలోత్సవ నిర్వహణా ఏర్పాట్లను వివరించి ఆహ్వానించారు. బాలోత్సవ నిర్వహణకు 250 మందితో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశామని, జిల్లాలోని 450 స్కూళ్లకు దరఖాస్తులు అందజేశామని వివరించారు. 12వ తేదీ ఉదయం వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్‌లో బాలోత్సవ ప్రారంభ కార్యక్రమానికి విచ్చేసి ప్రారంభించాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఇఒ

తేమ నిబంధనలు సడలించి ధాన్యాన్ని మిల్లులకు తోలాలి

ఎపి కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు

ప్రజాశక్తి - దెందులూరు

తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో తేమశాతం నిబంధనలు సడలించి కళ్లాల్లోని ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం దెందులూరు, ఏలూరు మండలాల పరిధిలోని పాలగూడెం, కొవ్వలి, పోతునూరు, దెందులూరు గ్రామాల్లో వారు పర్యటించారు. ధాన్యం కొనుగోలు, దిగుబడుల సమస్యలపై రైతులను, కౌలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరిబాబు, శ్రీనివాస్ మాట్లాడుతూ మొంథా తుఫాను కారణంగా ఎకరాకు పది బస్తాల వరకు దిగుబడులు తగ్గిపోయి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం ఆరబెట్టడానికి ఖర్చులు బాగా పెరిగిపోయాయన్నారు. మిషన్ల ద్వారా కోసిన ధాన్యం ఆరక ఐదు రోజులకుపైగా ఆరబెట్టినా తేమ ఎక్కువ ఉండటం వలన మిల్లులకు ధాన్యాన్ని తరలించే పరిస్థితి లేదన్నారు. మళ్లీ తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో తేమశాతం నిబంధనలు సడలించి కళ్లాల్లోని ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికపై మిల్లులకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నేతలు

కావ్య కుటుంబానికి న్యాయం కోరితే కేసులా..!

సంఘాల నేతలపై అక్రమ కేసులు సరికాదు

విద్యార్థిని మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని పి.కావ్య మృతికి కారకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం విద్యార్థి, యువజన, కార్మిక, దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ అధ్యక్షత వహించారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగభూషణం, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి డి.నాగేంద్ర, సిఐటియు పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, ప్రజాపోరాట సమితి నాయకులు సుందరం తదితరులు మాట్లాడారు. కావ్య ఆత్మహత్యకు కారకులను శిక్షించి, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని గొంతెత్తిన వారిపై ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయించడం సరికాదన్నారు. విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా పోరాటాలు నిర్వహించిన వారిపై అక్రమ కేసులు బనాయించడంతో పోరాటాలను అణిచివేయలేరని స్పష్టం చేశారు. ప్రజాసంఘాల నేతలను అధికారులు బెదిరించడం చూస్తుంటే కావ్య మృతిపై అనుమానాలు మరింత బలపడుతున్నాయన్నారు. సీసీ టీవీ ఫుటేజ్‌లో లోపాలు, సూసైడ్ లెటర్ ఉందనడం తదితర అంశాల నేపథ్యంలో ఈ ఘటనపై న్యాయ విచారణ జరపాల్సి ఉందన్నారు. లేనిపక్షంలో సంబంధిత అధికారులపై జిల్లా కలెక్టర్, ఎస్‌పి, మానవహక్కుల సంఘం, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కావ్య కుటుంబానికి న్యాయం జరిగే పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వంగ గోపీ, పి.రమేష్, ఎ.ప్రభాకర్‌రావు, రాజశేఖర్, రవితేజ, శాంతికుమార్, నాని, ఆశీర్వాదం, స్టాలిన్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో నినదిస్తున్న ప్రజాసంఘాల నేతలు

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాలనా సౌలభ్యం, ప్రజల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలను కలిపి ప్రత్యేక గిరిజన జిల్లాగా ఏర్పాటు చేయాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు చింతూరు, రంపచోడవరం, పోలవరం ప్రాంతాలతో ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. చింతూరు, రంపచోడవరం ఈ రెండు రెవెన్యూ డివిజన్లతోపాటు, పోలవరం నియోజకవర్గాన్ని కూడా కలిపి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలనేది అక్కడ ప్రజల కోరికని పేర్కొన్నారు. రంపచోడవరం నియోజకవర్గాన్ని జిల్లాగా ఏర్పాటు చేసి, పోలవరం జిల్లాగా పేరు పెట్టి పోలవరం నియోజకవర్గాన్ని కలపకపోవడం ఆక్షేపణీయమని పేర్కొన్నారు. నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని అక్కడ జెఎసి ఆధ్వర్యంలో ఆందోళనలు సాగుతున్నాయని, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణాజిల్లాలో కలపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. అన్నింటికీ మించి పోలవరం జిల్లా పేరే తప్ప పోలవరం అందులో లేకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల డిమాండ్లకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేయాలని కోరారు. పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం కలపడంపై ప్రజలతో కలిపి ఆందోళనలు, ఉద్యమాలు చేయడానికి తమ పార్టీ సమాయత్తమైందని పేర్కొన్నారు. దీనిలో భాగంగా డిసెంబర్ ఒకటో తేదీన బుట్టాయగూడెంలో వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు ఆదివాసీ సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిపి కార్యాచరణ నిర్ణయిస్తామని ఆయన ప్రకటించారు.

బుట్టాయగూడెం : ధర్నా చేస్తున్న నేతలు

భూ సమస్యల్లో పోలీసుల జోక్యం తగదు

సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ

బుట్టాయగూడెం : ఎల్‌టిఆర్, 1/70 చట్ట భూముల్లో పోలీసుల జోక్యం సరైంది కాదని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ విమర్శించారు. శనివారం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అమ్మపాలెం, గుంజవరం చీమలవారిగూడెం గ్రామాల్లో ఎల్‌టిఆర్, 1/70 చట్ట భూముల్లో సర్వే నెంబర్ 32లో 11:46 సెంట్లు భూమిపై స్థానిక ఆదివాసులు, గిరిజనేతరుల భూ వివాదం ఉందన్నారు. ఈ భూ సమస్యలపై స్థానిక పోలీస్ సిబ్బంది గ్రామాల్లోని ముఖ్యులతో ఫోన్లో, వ్యక్తిగతంగా ఫోన్ చేస్తూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. పోలీస్ స్టేషన్‌కు రమ్మని, రికార్డులు చూపాలని పోలీసులు చెప్పడం సరైంది కాదన్నారు. పోలీసులు సివిల్ భూ తగాదాల్లో జోక్యం చేసుకొని ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేయడం గిరిజన చట్టాలను కాలరాస్తున్నారన్నారు. పోలీసులు రికార్డులు చూస్తామని తహశీల్దార్ విధులు కూడా వాళ్లే చేసేలా ప్రస్తుతం ఇక్కడ ఉందని ఎద్దేవా చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో భూ వివాదాలు వచ్చినప్పుడు తహశీల్దార్ ఇరుపక్షాల రికార్డులు చూడాలని ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. భూ వివాదాల్లో పోలీసుల జోక్యం నిలువరించాలని, రెవెన్యూ అధికారులు బాధ్యతగా పనిచేయాలని, లేని పక్షంలో మరిన్ని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తామ ముత్యాలమ్మ, పోలోజు నాగేశ్వరావు, వెట్టి వీరయ్య, కారం ముత్యాలరావు, పి.గంగరాజు, అన్నిక వెంకటస్వామి, పూనెం దుర్గారావు, మిర్తివాడ రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి

ఆక్వా రంగం రాష్ట్ర కన్వీనర్ బి.బలరాం

ప్రజాశక్తి - కైకలూరు, మండవల్లి

మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆక్వా రైతులకు చేరువ చేస్తే ఆక్వా రైతాంగం మరింత బలోపేతం అవుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఆక్వా రంగం రాష్ట్ర కన్వీనర్ బలరాం స్పష్టం చేశారు. మండలంలోని లోకుమూడి సిఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఆక్వాటెక్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ సాంకేతిక అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వారంగాన్ని మరింత అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి మరింత ఆదాయం వస్తుందన్నారు. ట్రంప్ విధిస్తున్న అదనపు సుంకాలను తప్పి కొట్టే శక్తి ఒక్క భారతదేశానికి ఉందని తెలిపారు. మనదేశంలోని ప్రజలకు సీ ఫుడ్ వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ తగు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడితే ట్రంప్ ఇతర సుంకాలు ఏమీ చేయలేవని వివరించారు. విద్యుత్ సర్ ఛార్జీలతో పాటు ఇతర ఛార్జీల భారాన్ని రైతులపై మోపకుండా ఉంటే ఆక్వారంగం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. 2006 కొల్లేరు ఆపరేషన్ అనంతరం కొల్లేరు ప్రజల పరిస్థితి ఒడ్డున పడిన చేపలా మారిందని, కొల్లేరు ప్రజల జీవితాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని, కొల్లేరు ప్రాంత ప్రజలను ఆదుకోవాలని అన్నారు. అనంతరం ఆయనను ఘనంగా దుశాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎంఎల్‌సి జయ మంగళ వెంకటరమణ, వేర్ హౌస్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, రాష్ట్ర చాపల రైతు సంఘం అధ్యక్షులు నంబూరు వెంకటరామరాజు, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విట్టల్ రావు, రాష్ట్ర వడ్డెర సంఘం కార్పొరేషన్ ఛైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, టిడిపి కో కన్వీనర్ బొమ్మన బోయిన విజయలక్ష్మి, రాష్ట్ర క్షత్రియ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ అండ్ రాజ్ శ్రీనివాసరాజు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంక రత్నారావు పాల్గొన్నారు.

బలరాంను సత్కరిస్తున్న వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి

తుపాన్ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

కల్లాల్లోనే పలుచోట్ల ధాన్యపు రాశులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

దిత్వా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం ఆరబెట్టుకుని సంచుల్లో నింపి రవాణా కోసం ఎదురు చూస్తున్న రైతుల్లో ఆందోళన నెలకొంది. మండలంలో 24,750 ఎకరాల్లో వరి పండించారు. ఇంతవరకూ 21,230 ఎకరాల్లో వరి కోతలు పూర్తయి ధాన్యం అమ్మకాలు సాగాయి. ఇంకా 3150 ఎకరాల్లో పంట కోతకు సిద్ధంగా ఉంది. 43420 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటి వరకూ 10,910 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. తేమ శాతం నిబంధనల మేరకు రాకున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి మిల్లులకు తోలేలా అధికారులు చర్యలు తీసుకోవడం రైతులకు ఒకింత ఉపశమనం కల్గించింది. అక్కడక్కడా సంచులు సకాలంలో అందకపోయినా వర్తకులు, రైతుల దగ్గర నుంచి సంచులు తెచ్చుకుని ధాన్యం నింపుకుంటున్నారు. కాకర్లమూడిలో సాగు ప్రారంభంలో వర్షాల కారణంగా చేలు ముంపుబారిన పడ్డాయి. తిరిగి రెండోసారి నాట్లు వేయడంతో వరి కోతలు ఆలస్యంగా రానున్నాయి. ఈక్రమంలో దిత్వా తుపాన్‌కు దొరికేస్తామేమో అని రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆ గ్రామ ఎంపిటిసి కూన మణి అన్నారు. తుపాన్ కారణంగా ధాన్యం కొనుగోలు వేగవంతం చేశామని ఎఒ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. వరి కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

హామీలు సరే.. కార్యాచరణేదీ..!

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పర్యటన, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం రెండు జిల్లాల్లో అధ్వానంగా తయారైన రోడ్ల పరిస్థితిపై మరోసారి చర్చకు వేదికలయ్యాయి. ఇక ధాన్యం రైతుల పరిస్థితి ఏంటనేది పౌర సరఫరాల శాఖ మంత్రి క్షేత్రస్థాయి పర్యటనలో బట్టబయలైంది. జిల్లాల పునర్విభజనకు ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో తీవ్ర కలకలం సృష్టించింది.

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం మండలం రాజవరం వద్ద ఆ పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తమ రోడ్ల సమస్య పరిష్కరించాలంటూ రోడ్డెక్కడం గమనార్హం. తొలుత పోలీసులు వారిని వెనక్కి పంపే ప్రయత్నం చేసినా వారేమాత్రం తగ్గకుండా తమ సమస్య చెప్పుకుని తీరుతామని భీష్మించడంతో పవన్ తన పర్యటన ముగించుకుని వెళ్తూ వారి సమస్యపై వినతిపత్రం అందుకుని త్వరలోనే రోడ్ల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇక జిల్లా పరిషత్ సమావేశంలోనూ రోడ్ల సమస్యపై అధికార పార్టీ ఎంఎల్ఎలే గళమెత్తారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కూటమి అధికారంలోకి రాగానే సంక్రాంతి లోపు గోతులు పూడ్చి, ఆపై పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడతామని ప్రకటించింది. ఆ సంక్రాంతి వెళ్లి మరో సంక్రాంతి వస్తుందిగాని రెండు జిల్లాల్లో రోడ్ల పరిస్థితి బాగుపడలేదు. దీనికి నిదర్శనం ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలే నిదర్శనం. అటు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఇటు జెడ్‌పిలో చర్చ నేపథ్యంలో రోడ్ల పనులు ఇప్పటికైనా చేపడతారా అని రెండు జిల్లాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇటీవల ఉంగుటూరు నియోజకవర్గంలో రెండుసార్లు పర్యటించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మార్గమధ్యంలో రోడ్లపై ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులను పలుకరించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలు మొర పెట్టుకున్నారు. ఈ సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే ప్రభుత్వం, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేసినా అవేమీ అమలు కాకపోవడం మంత్రినే విస్మయానికి గురి చేసింది. తమ ధాన్యం ఏ మిల్లుకు తోలుతున్నారో కూడా రైతులకు తెలియని పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదని మంత్రి పర్యటనలో వెల్లడైంది. ధాన్యం మిల్లుకు తోలిన 24 గంటల్లో సొమ్ము జమ చేస్తున్నామంటున్న ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆ ప్రక్రియకు ముందు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

ఇక కొత్త జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రధానంగా పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా అందులో పోలవరం నియోజకవర్గంగాని, కెఆర్‌పురం ఐటిడిఎ పరిధిలోని ఐదు మండలాలుగాని లేకుండానే నోటిఫికేషన్ విడుదల చేయడం చర్చనీయాంశమైంది. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావాలంటే రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాల్లోని గిరిజన మండలాలతో గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. దీనిపై ఎన్నికలకు ముందు చంద్రబాబు సైతం హామీ ఇచ్చారు. అయితే తాజా నోటిఫికేషన్‌లో ఏలూరు జిల్లాలోని ఐదు గిరిజన మండలాలను విస్మరించడం ఈ పరిధిలోని నిర్వాసితులకు తీవ్ర నిరాశ కల్గించింది. ఎందుకంటే ఇదే మండలాల్లో రంపచోడవరం నియోజకవర్గంలోని నిర్వాసితులకూ పునరావాసం కల్పిస్తున్నారు. వారు తమ సమస్యల పరిష్కారం కోసం ఏలూరు వెళ్లాల్సి రావడం అంటే కష్టసాధ్యమే. మొత్తంగా నిర్వాసితులంతా ఒకే జిల్లా పరిధిలోకి వస్తే ప్రాధాన్యత క్రమంలో వారి సమస్యలను పరిష్కరించడానికి అధికారులకూ అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ఆ దిశగా నిర్ణయం తీసుకోవాలని ఏలూరు జిల్లాలోని ఐదు ఏజెన్సీ మండలాల ప్రజలు కోరుతున్నారు. ఇక నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలోనూ, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలోనూ కలపాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. అయితే ఆ ప్రస్తావనేమీ ఈ నోటిఫికేషన్‌లో లేదు. మొత్తంగా హామీలివ్వడం తప్ప కార్యాచరణలో చర్యలు ఉండటం లేదని జనం పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు హామీల అమలు దిశగా అడుగులు వేయాలని జనం కోరుతున్నారు.

- వివిఎస్‌వి.ప్రసాద్

ఎపి శాప్ డైరెక్టర్ జగదీశ్వరికి సత్కారం

ప్రజాశక్తి - పోలవరం

జగదీశ్వరిని సత్కరిస్తున్న హేమ

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం అమలు వేగవంతం చేసేందుకు మంగళగిరిలో శనివారం నిర్వహించిన ఎంటర్‌ప్రెన్యూర్షిప్ అవగాహన సమావేశం ఉత్సాహభరితంగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరిని ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నేషనల్ జనరల్ సెక్రటరీ హేమ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి, నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సుబీర్పాల్, సౌత్ ఇండియా కోఆర్డినేటర్ ఆదినారాయణ, జనరల్ సెక్రటరి బి.విజయ్ నాయక్ పాల్గొన్నారు.

ఇంటి దరఖాస్తుదారులతో సచివాలయాల రద్దీ

నేటితో ముగియనున్న ప్రక్రియ

ప్రజాశక్తి - దెందులూరు

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పిఎం ఆవాస్ యోజన(గ్రామీణ్)-ఎన్‌టిఆర్ పథకంలో నమోదు ప్రక్రియ ఈనెల 30తో ముగియనుండటంతో ప్రజలు సచివాలయాల వద్ద పోటెత్తుతున్నారు. సొంత స్థలం ఉన్నవారికి ఆర్థిక సాయం, సొంత స్థలం లేనివారికి 3 సెంట్ల స్థలం, ఆర్థిక సాయం అందిస్తున్నాయి. ఇందుకు సంబంధించి దరఖాస్తు గడువు ఈనెల 30తో ముగియనుంది. అర్హులైన వారు గ్రామ, మున్సిపల్ వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. శ్రీపర్రు గ్రామానికి 320 వరకు ఇళ్లు మంజూరు కాగా ఇప్పటికే అంతకు మించిన దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. తమ పేర్లు నమోదు చేసుకునేవారి సంఖ్య శనివారం ఎక్కువగా ఉండటంతో సచివాలయ సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

డిసిసి జిల్లా అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



వినతిని అందజేస్తున్న గోళ్ల పవన్‌కుమార్

దేశవ్యాప్తంగా ఎఐసిసి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంఘటన సృజన అభియాన్ కార్యక్రమానికి విచ్చేసిన ఎఐసిసి కార్యదర్శి, ఏలూరు పరిశీలకులు ప్రవీణ్ ధావర్‌కు శనివారం నూజివీడు కాంగ్రెస్ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోళ్ల పవన్ కుమార్ తన అభ్యర్థన పత్రాన్ని సమర్పించారు. తాను 15 సంవత్సరాల నుండి కాంగ్రెస్‌లో పని చేస్తున్నానని, 25 సంవత్సరాల నుండి తమ కుటుంబం కాంగ్రెస్‌లో చక్రసిద్ధితో పనిచేస్తుందన్నారు. నూజివీడు నియోజకవర్గానికి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఉమ్మడి కృష్ణా జిల్లాకి యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శక్తి వంచన లేకుండా పనిచేశానని, 2018లో యువజన కాంగ్రెస్ ఎన్నికలలో మచిలీపట్నం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెలిచానని, ప్రస్తుతం యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్‌టిఆర్ జిల్లా యువజన కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నానన్నారు. రాహుల్ గాంధీ యువతకు ప్రాధాన్యత అత్యధికంగా ఇస్తున్నారు కాబట్టి తనకు ఏలూరు జిల్లా డిసిసి అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలని విన్నవించారు.

యుటిఎఫ్ నగర నూతన కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) ఏలూరు నగర అధ్యక్షునిగా సిహెచ్.షణ్ముఖి, ప్రధాన కార్యదర్శిగా జొన్నకూటి రాజారావు, ట్రెజరర్‌గా కోరాడ కిరణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం రాత్రి స్థానిక యుటిఎఫ్ కేంద్ర కార్యాలయంలో ఏలూరు నగర శాఖ నూతన కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించగా ప్రధాన కార్యదర్శి రాజారావు శనివారం ఆ వివరాలను పత్రికలకు విడుదల చేశారు. ఎం.చిట్టిబాబు గౌరవ అధ్యక్షునిగా, కె.దొరబాబు సహాధ్యక్షునిగా, ఆర్.రాజేశ్వరి సహ అధ్యక్షురాలుగా ఎన్నికవ్వగా నగర కార్యదర్శులుగా సీనియర్ కార్యవర్గ సభ్యులు ఆర్‌విఆర్‌కె.వరప్రసాద్, టి.మారుతి, కె.మహంకాళి రావు, పి.విజయలక్ష్మి, డి.రామచంద్రరావు, కె.శ్రీనివాసరావు, ఎమ్‌డి సాధిక్, ఎం.శ్రీలక్ష్మి ఎంపికయ్యారు. నగర ఆడిటర్‌గా డి.జగదీష్, సాంస్కృతిక కమిటీ విభాగం కార్యదర్శిగా టి.రాజారావు, మహిళా విభాగం కార్యదర్శిగా అల్లాడి పార్వతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని రాజారావు తెలిపారు. జిల్లా కౌన్సిలర్లుగా జొన్నకూటి రాజారావు, షేక్ పర్వీన్ బేగం, కెవి.అప్పారావు, ఆర్‌విఆర్‌కె.వరప్రసాద్, ఎం.చిట్టిబాబు, టి.మారుతి, సిహెచ్.షణ్ముఖి, ఎమ్‌డి జిక్రియ, కె.కిరణ్‌కుమార్, ఆర్.రాజేశ్వరి, కె.దొరబాబు ఎంపికైనట్లు తెలిపారు. పరిశీలకులుగా ఈడే శివశంకరరావు ఎన్నిక ప్రక్రియ నిర్వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ నూతన కమిటీని అభినందించారు.

పదో తరగతి మోడల్ పేపర్స్ అందజేత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం ప్రచురించిన పదవ తరగతి మోడల్ పేపర్స్‌ను శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఆమె కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ యుటిఎఫ్ ఈ మోడల్ పేపర్స్‌ను ప్రచురించి విద్యార్థులకు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ ఆవిష్కరణలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎమ్.శ్యాంబాబు, సహాధ్యక్షులు ఎస్.సుధారాణి, ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి రవికుమార్, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్ పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెంలో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. గత సాధారణ సమావేశంలో నాలుగో వార్డుకు కేటాయించిన నిధులను తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తూ నాలుగో వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ సమావేశం మధ్యలోనే నేలపై కూర్చొని నిరసన తెలిపారు. ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అనుమతి, ఇతర కౌన్సిలర్ల సహకారంతో నాలుగో వార్డులో డ్రెయిన్ నిర్మాణానికి మళ్లీ నిధులు కేటాయించాలని నిర్ణయించారు. మరోవైపు కాంట్రాక్టు బిల్లుల చెల్లింపులో జాప్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ కౌన్సిల్ సభ్యులు ప్లకార్డులు పట్టుకొని సమావేశానికి హాజరయ్యారు. మున్సిపాలిటీకి చెందిన రూ.8 కోట్ల 50 వేల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - పెదవేగి

రాష్ట్రంలోని పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని, గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో పేదలకు రావాల్సిన ఇంటి బిల్లుల చెల్లింపులు జరగక ఎంతోమంది పేదలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకరరావు అన్నారు. మరోవైపు అనర్హులను లబ్ధిదారులుగా చూపించి పేదలకు చెందాల్సిన ప్రభుత్వ సొమ్మును వైసిపి నాయకులు దోచుకున్నారని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి పేదల సొంతింటి కల సహకారం చేయడానికి కషి చేస్తుందన్నారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని గృహనిర్మాణ, సచివాలయ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పలువురు కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి - కామవరపుకోట

మండల కేంద్రమైన కామవరపుకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యాన రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నట్టు సొసైటీ ఛైర్మన్ ఘంటా మాధవరావు తెలిపారు. తాను ఛైర్మన్ అయ్యాక సొసైటీ ఆధ్వర్యాన ఎరువుల అమ్మకాలు తిరిగి ప్రారంభించామన్నారు. రైతులకు అవసరమైన యూరియా, డిఎపి, 14 - 35, 20-20 అందుబాటులో ఉన్నాయన్నారు. సొసైటీ, రావికంపాడు రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించామని, రైతులు ఈ అవకాశం సద్వినియోగించుకోవాలని సూచించారు.

దంతులవారిగూడెంలో రోడ్డు నిర్మించాలని వినతి

నూజివీడు టౌన్ : మండలంలోని తుక్కులూరు గ్రామ పంచాయతీ శివారు దంతుల వారి గూడెం గ్రామంలో శనివారం సాయంత్రం మండల పరిషత్ ఆధ్వర్యాన గ్రామసభ నిర్వహించారు. మండల పరిషత్ ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపిడిఒ సైనేజ్ బేగం మాట్లాడుతూ కలెక్టర్ దంతుల వారి గూడెం రోడ్డు నిర్మాణాన్ని మంజూరు చేయగా తుక్కులూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పెద్దగా జనం లేని ప్రాంతానికి రూ.86 లక్షలు వెచ్చించి రోడ్డు ఎందుకు నిర్మిస్తున్నారని, ప్రధాన గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేయాలని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆయనుకు ఆటంకం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శి చంద్రిక, పంచాయతీరాజ్ ఎఇ విజయ్ గోపాల్, గ్రామ సర్పంచి రోడ్డు నిర్మాణం కావాలని తీర్మానం చేస్తూ సంతకాలు సేకరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ప్రభుత్వ కార్యాలయాలు

హౌసింగ్ కార్యాలయం వరండా వద్ద మందుబాబుల ఆగడాలు

గృహనిర్మాణ శాఖ కార్యాలయ ఆవరణలో మద్యం సీసాలు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాలు రాత్రి వేళల్లో మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ఇష్టానుసారంగా మద్యం సేవించి మత్తులో కార్యాలయాల తలుపులు, తాళాలు పగలగొట్టే దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. ఈనెల 23న రాత్రి హౌసింగ్ కార్యాలయం వరండా వద్ద మందుబాబులు మందుకొట్టి మద్యం మత్తులో గృహనిర్మాణ శాఖ కార్యాలయ తలుపు, తాళం పగలగొట్టడానికి ప్రయత్నించిన సంఘటన మందుబాబుల ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నాయనే తీరును తేటతెల్లం చేస్తుంది. అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న మందుబాబుల ఆగడాలకు ప్రభుత్వ కార్యాలయాల్లోని ముఖ్యమైన పత్రాలకు, వస్తువులకు రక్షణ కరువడిందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని ప్రజలకు ప్రభుత్వపరమైన సేవలు అందించే విధంగా ప్రభుత్వ కార్యాలయాలను మండవల్లిలో ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేశారు. సచివాలయంతో పాటు రెవెన్యూ మండల డెవలప్మెంట్, వ్యవసాయ, శిశుసంక్షేమ, గృహనిర్మాణ, డ్వాక్రా సంఘాల కార్యాలయం, విద్యాశాఖ కార్యాలయంతో పాటు ఎస్‌సి హాస్టల్ అదే ప్రాంతంలో ఉంది. పగలంతా వివిధ కార్యకలాపాలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం చీకటి పడితే మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోతున్నాయి. రాత్రి వేళల్లో జనసంచారం తక్కువగా ఉండడం, విద్యుత్ దీపాలు సక్రమంగా లేకపోవడంతో మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డూ అదుపు లేకుండా సాగిపోతున్నాయి. ఉదయాన్నే ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న అధికారులకు చిప్స్ ప్యాకెట్లు, సిగరెట్ ముక్కలు, బీర్, మందు బాటిల్స్‌తో పాటు మద్యం సేవించిన గ్లాసులు కార్యాలయ గుమ్మం ముందు దర్శనమిస్తుంటాయి. ఇదేవిధంగా ఆదివారం రాత్రి కొంతమంది మద్యం బాబులు గృహనిర్మాణ శాఖ కార్యాలయం ముందు మద్యం సేవించడమే కాకుండా కార్యాలయానికి ఉన్న తలుపు తాళాన్ని బద్దలు కొట్టేందుకు ప్రయత్నించేప్పటికీ తలుపు రాకపోగా తాళం పగలలేదు. తాళాలు పగిలుంటే తలుపు తెరిచి లోపల ఉన్న సామగ్రిని, ముఖ్యమైన కాగితాలను నాశనం చేసి ఉండేవారని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ కార్యాలయాల్లోని ముఖ్యమైన పత్రాలు, విలువైన సామగ్రిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై గృహనిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ లలిత కుమారిని వివరణ కోరగా ఈనెల 24న కార్యాలయానికి వచ్చి కార్యాలయ తలుపులు తెరిచే క్రమంలో తాళాన్ని, తలుపును పగలగొట్టడానికి ప్రయత్నించి ఉండడాన్ని గమనించడంతోపాటు కార్యాలయం ముందు మద్యం సీసాలు, మద్యం తాగిన గ్లాసులు, చిప్స్ ప్యాకెట్ ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. రాత్రి వేళల్లో కార్యాలయంపై గస్తీ ఉంచుతామని పోలీసులు తెలిపినట్లు చెప్పారు.

క్రీడలు నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయి

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్

బుట్టాయగూడెం : పోటీలు ప్రారంభిస్తున్న పిఒ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

క్రీడలు ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో జట్టు భావన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ తెలిపారు. ఐటిడిఎ కెఆర్ పురంలో బుట్టాయగూడెం మండల స్థాయిలో నిర్వహించబడుతున్న ఉపాధ్యాయుల ఎంపిక క్రీడా పోటీలను(క్రికెట్, త్రోబాల్) ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొని మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడా కార్యక్రమాల్లో ఐటిడిఎ కెఆర్ పురం డివైఇఒ రవి ప్రసన్న కుమార్, ఐటిడిఎ కెఆర్ పురం ఎఎంఒ శిరమయ్య, ఎంఇఒ-2 నరేంద్ర రాజ్, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో భాగంగా మండల స్థాయి ఆటల పోటీలు శనివారం జెడ్‌పిహెచ్‌ఎస్ బాయ్స్ స్కూల్‌లో నిర్వహించారు. మగ ఉపాధ్యాయుల కోసం క్రికెట్, మహిళా ఉపాధ్యాయుల కోసం త్రోబాల్ పోటీలు నిర్వహించగా ఉత్సాహంతో ఆటలు సాగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒ-1 బి.రాముడు, ఎంఇఒ-2 జి.రాములు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వ హిస్తున్న ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలకు ఎంపిక చేస్తామని తెలిపారు. మండల ఉపాధ్యాయులను రెండు జట్లుగా విభజించి జరిగిన క్రికెట్ పోటీల్లో షరీఫ్, శశికుమార్ జట్లు తలపడ్డాయన్నారు. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో షరీఫ్ జట్టు విజయం సాధించిందని, అయితే రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నందున, వాటిలో నుంచి మెరుగైన వారిని ఎంపిక చేసి డివిజన్ స్థాయికి టీమ్ పంపనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. పోటీలను స్థానిక పీడీ సాయి శ్రీనివాస్ ఆధ్వర్యాన పిఇటిలు నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంగా విద్యాశాఖ అధికారులు కాటన్ ఓపెనింగ్ చేసి స్వయంగా క్రికెట్ ఆడి పాల్గొన్న వారిని ఉత్సాహపరిచారు.

ముసునూరు : ఉపాధ్యాయులు చదువుతో పాటు విద్యాబుద్ధులు నేర్పటంలోనే కాకుండా ఆటల్లో కూడా తమ సత్తా చాటుతారని మండల విద్యాశాఖ అధికారులు బివిఎస్.సుబ్బారావు, సుభాషిణి పేర్కొన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ కలిసి మండల స్థాయిలో ఆటల పోటీల్లో విజయం సాధించి, నరసాపురంలో జరిగే డివిజన్ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు తెలియజేశారు. వీరిలో కాసాని గంగాయుడు, జి.పద్మ కిషోర్, హేమ, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండవల్లి : విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేసే ఉపాధ్యాయులకు ఆటలు సంతోషాన్ని కలిగిస్తాయని ఎంఇఒ రత్న సునాదం సురేష్ కుమార్ స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు డివిజన్ స్థాయి ఆటల పోటీలకు శనివారం సెలక్షన్లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని ఆటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళ ఉపాధ్యాయులకు త్రోబాల్‌ను, పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ ఆటలో పోటీలను నిర్వహించారు. క్రికెట్ విభాగంలో మండల క్లస్టర్ ఉపాధ్యాయులు ఎన్నికవ్వగా, మహిళా ఉపాధ్యాయుల విభాగంలో చింతపండు మహిళా ఉపాధ్యాయులు విజేతలుగా నిలిచారు. ఉపాధ్యాయులు రామోజీరావు, వై.రాజేషు శేషగిరి, ఫిజికల్ డైరెక్టర్ వేణు, రవి పాల్గొన్నారు.

కామవరపుకోట : మండల స్థాయిలో జరిగిన ఉపాధ్యాయుల ఆటల పోటీల్లో క్రికెట్ నుండి 16 మంది పురుష ఉపాధ్యాయులు, త్రోబాల్ నుండి ఏడుగురు మహిళా ఉపాధ్యాయులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్యామలాదేవి తెలిపారు. ఈ పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఎంపికైన వీరు త్వరలో డివిజన్ స్థాయిలో జరగబోవు ఆటల పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన వీరిని మండల విద్యాశాఖ అధికారి ప్రశాంత్ కుమార్, ప్రధానోపాధ్యాయులు డి.గవర్రాజు, ప్రధానోపాధ్యాయులు కె.జయ శుభకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

గెలుపొందిన విద్యార్థులతో అధ్యాపకులు

ఎయిడ్స్ డే సందర్భంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యాన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించే దిశగా పోస్టర్ ప్రెజెంటేషన్, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు హాజరై పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ఎయిడ్స్ నివారణ, అవగాహనలో కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. ముగ్గుల పోటీల్లో కె.శైలు, డి.మేరీ జాస్మిన్, ఎల్.అనుష ప్రథమ బహుమతి సాధించగా పి.భానుజ, ఎం. గాయత్రి ద్వితీయ బహుమతి, కె.గగన, ఎం.సోనియాచ్యుత తృతీయ బహుమతి సాధించారు. పోస్టర్ ప్రెజెంటేషన్‌లో పి.భానుజ ప్రథమ బహుమతి, ఎల్.హేమ గంగారాణిశ్రీ ద్వితీయ బహుమతి, కె.శైలు తృతీయ బహుమతి సాధించారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.విజయ కుమార్ పాల్గొన్నారు.

బహుమతులందజేస్తున్న ప్రముఖులు

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని త్రివిధ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం నూజివీడు డివిజన్ ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ అప్సా డెమోక్రటిక్ ఆధ్వర్యాన బాలురకు సీనియర్, జూనియర్ విభాగంలో ఆటల పోటీలు కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, సబ్ జూనియర్ లెమన్ అండ్ స్పూన్, ఫ్రాగ్ జంప్ లాంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నూజివీడు, చాట్రాయి, ముసునూరు మండలాల నుండి ఆగిరిపల్లి 12 పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ పోటీలకు నూజివీడు డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పిఎస్.సుధాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఆటల పోటీలు ప్రారంభించారు. బహుమతులను సాయి ప్రణతి పాఠశాల డైరెక్టర్ అనురాధ తండ్రి కీర్తిశేషులు నాగేశ్వరరావు పేరు మీద అందజేశారు.

'పోలవరంపై ఎంఎల్‌ఎ వైఖరి తెలపాలి'

బుట్టాయగూడెం : పోలవరంపై మీ వైఖరేంటని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లేనందున ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుని సూటిగా ప్రశ్నించారు. పోలవరం నియోజకవర్గంలో మొత్తం ఏడు మండలాల్లో ఐదు మండలాలు షెడ్యూల్ ప్రాంతంలో, రెండు మండలాలు మైదాన ప్రాంతంలో ఉన్నాయని, మైదాన ప్రాంత మండలాలైన కొయ్యలగూడెం, టి.నర్సాపురం మండలాల్లో కొన్ని ఆదివాసి గ్రామాలు ఉన్నాయన్నారు. అవి ఒకప్పుడు పోలవరం తాలూకాలో ఉండేవని, మండలాల ఏర్పాటు సమయంలో పోలవరం తాలూకాను పోలవరం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాలుగా ఏర్పాటు చేస్తూ కొన్ని గ్రామాలను కొయ్యలగూడెం, టి.నర్సాపురం, గోపాలపురం మండలాల్లో కలపడం జరిగిదని తెలిపారు. ప్రస్తుతం రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేయబోయే పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలో ఉన్న ముంపు మండలాలు కలపాలని, ఎంఎల్‌ఎ మౌనం వీడాలని అన్నారు.

డ్రైవర్లు భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థుల భద్రతపై డ్రైవర్లకు ఉన్న బాధ్యత ఎంతో ముఖ్యమైనదని, కొద్ది నిర్లక్ష్యం కూడా తీవ్ర ప్రమాదాలకు దారితీసే ప్రమాదం ఉందని, తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని చింతలపూడి సిఐ క్రాంతికుమార్ హితవు పలికారు. విద్యార్థులను తరలించే పాఠశాల, కాలేజీ బస్సుల డ్రైవర్లకు రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి జంగారెడ్డిగూడెం ఎఎస్‌పి సుస్మిత ఆదేశాలపై చింతలపూడి సిఐ క్రాంతి కుమార్, ఎస్ఐ సతీష్ కుమార్ శనివారం భగవత్ సింగ్ డ్రైవర్ సంఘం వారికి అవగాహన కల్పించారు. చింతలపూడి సర్కిల్ పరిధిలో చింతలపూడి, ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పాఠశాలలు, కాలేజీలకు విద్యార్థులను రవాణా చేసే భగవత్ సింగ్ డ్రైవర్ సంఘం బస్సు డ్రైవర్లకు రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రైవర్లకు రోడ్డు భద్రతా నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్, విద్యార్థుల రక్షణకు పాటించవలసిన జాగ్రత్తలు, వాహన పరిస్థితిని ముందుగానే పరిశీలించాల్సిన అవసరం, వేగం నియంత్రణ వంటి అంశాలపై విపులంగా వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ స్కూల్, కాలేజీ బస్ డ్రైవర్లు మద్యం సేవించి బస్సులను నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, వారి లైసెన్సుల రద్దుకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలు మీపై ఆధారపడి ఉన్నాయని, ప్రతి ఒక్కరూ గమనించాలని డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్కూల్ బస్సు డ్రైవర్‌లు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ప్రయివేట్ స్కూల్ యాజమాన్యం తమ బస్సుల ఫిట్‌నెస్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని నూజివీడు ప్రాంతీయ రవాణాశాఖ అధికారిణి ఎల్.అన్నపూర్ణ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం శనివారం ఆమె బెతెస్థ, సరస్వతి, ఎస్‌వి.స్కూల్‌నకు చెందిన బస్సులను తనిఖీ చేశారు. రోడ్డు భద్రతా నియమాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది, స్కూల్ యాజమాన్యాలు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పలుచోట్ల రైతన్నా మీకోసం

ప్రజాశక్తి - చింతలపూడి



చింతలపూడి : రైతులకు వివరిస్తున్న ఎఎంసి ఛైర్మన్

చింతలపూడి నియోజకవర్గంలో రైతులకి రూ.24 కోట్ల 50 లక్షల అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ధి చేకూరేలా ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ కృషి చేశారని చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ చీదరాల దుర్గా పార్వతి మధుబాబు అన్నారు. మండలంలోని వెంకటాద్రిగూడెం గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది రైతుల ప్రభుత్వమని, ఇంటింటికీ తిరిగి రైతులకి కూటమి ప్రభుత్వం చేసే సంక్షేమం గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమం లో ఏలూరు పార్లమెంట్ తెలుగు రైతుసంఘం అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరావు, టిడిపి మండల అధ్యక్షులు చింతం విష్ణు, పోతునూరు సొసైటీ ఛైర్మన్ శీతల గాంధీ, పోతునూరు సొసైటీ డైరెక్టర్ రాగం రాము, వెంకటాద్రిగూడెం గ్రామ ప్రెసిడెంట్ పోలిశెట్టి శ్రీను, కూటమి నాయకులు, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : మండలంలోని ఖండ్రిక హడెం గ్రామంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ యాంత్రీకరణ, ముఖ్యమంత్రిచే ప్రతిపాదింపబడిన 5 సూత్రాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎం.సోంబాబు, మండల వ్యవసాయాధికారి ప్రియాంక, విఎఎ.లావణ్య, రాంబాబు, నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, కృష్ణా, రైతులు పాల్గొన్నారు.

పెదపాడు: ప్రతి రైతును భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా ప్రతి గడపకు ప్రభుత్వం రైతులకు అందించిన సంక్షేమం, ముఖ్యంగా అన్నదాత సుఖీభవ రెండవ విడత ప్రయోజనాలు గురించి ఎంఎల్‌ఎ చింతమనేని వివరించారు. శనివారం ఉదయం 10 గంటల నుండి వట్లూరు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి పెదపాడు మండల స్థాయి అధికారులు వారి సమగ్ర నివేదికతో, అప్పనవీడు-1,2, ఏపూరు 1,2, కలపర్రు, కొక్కిరపాడు 1,2, వట్లూరు 1,2,3 గ్రామ సచివాలయాల సిబ్బంది హాజరు కావలసినదిగా తెలిపారు.

పెట్రోల్ బంకులో అవినీతిపై దర్యాప్తు చేయాలి

కొనసాగిన ఆర్‌టిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ఆర్‌టిసి డిపో వద్ద నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో జరిగిన రూ.83 లక్షల స్కామ్‌పై జ్యుడీషియల్ దర్యాప్తు జరిపి దోషులను గుర్తించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే డిమాండ్ చేశారు. నలుగురు ఉద్యోగులపై ఆర్‌టిసి యాజమాన్యం విధించిన అక్రమ సస్పెన్షన్ ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన ఏలూరు ఆర్‌టిసి గ్యారేజీ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శనివారం సందర్శించి డాంగే సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఆర్‌టిసి ఆయిల్ బంక్ నిర్వహణలో జరుగుతున్న లోపాలను గుర్తించడంలో యాజమాన్యం వైఫల్యం చెందిందని పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాల తర్వాత 83 లక్షల రూపాయల స్కాముపై సంపూర్ణ దర్యాప్తు జరపకుండా, స్కామ్‌తో సంబంధం ఉందో లేదో తెలియకుండా నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయటం ఎంతవరకు సమంజసమో యాజమాన్యమే తెలపాలన్నారు. ఆర్‌టిసి ఆయిల్ బంక్ స్కాంపై జ్యుడీషియల్ దర్యాప్తుకు యాజమాన్యం ఆదేశించాలని, ఆ దర్యాప్తులో దోషులను నిర్ధారించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఆర్‌టిసి జెఎసి నాయకులు వై.శ్రీనివాస్, టికె.రావు పాల్గొన్నారు. శనివారం దీక్షలో టిఎస్‌కె.బాబు, వి.ఆంజనేయులు, బిఎన్‌వి.ప్రసాద్, వివి.రెడ్డి, ఐహెచ్.రావు, ఎఎస్.రావు, టిడి.చారి కూర్చున్నారు.

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లేకపోవడం విచారకరమని, ఈ అంశంపై వచ్చేనెల ఒకటవ తేదీ సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం ఉదయం 10 గంటలకు బుట్టాయగూడెంలో ఉన్న ఆదివాసి విజ్ఞాన కేంద్రం భవనం వద్ద నిర్వహిస్తున్నామని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ తెలిపారు. ఈ సమావేశంలో ఆదివాసి సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు, పెద్దలు, మేధావులందరూ హాజరై తమ సూచనలు, సలహాలు ఇవ్వవలసిందిగా కోరారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు

ఏలూరు అర్బన్ : ఖైదీల ఆరోగ్య సంరక్షణ, సంక్షేమం కోసం జిల్లా జైల్ సూపరింటెండెంట్ ఆధ్వర్యాన ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ సహకారంతో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కొత్తా నాగేశ్వరరావు, డాక్టర్ కొత్తా నాగేశ్వరి నేతృత్వంలో ఉచిత చెవి, ముక్కు, గొంతు, చర్మవ్యాధుల వైద్య శిబిరాన్ని జిల్లా కారాగారంలో శనివారం నిర్వహించారు. 100 మంది ఖైదీలను, సిబ్బందిని పరీక్షించి అవసరమైన మందులను వారికి అందించారు. క్లబ్ అధ్యక్షులు బివివి.సత్యనారాయణ, లయన్స్ జిల్లా నాయకులు ఎల్.వెంకటేశ్వరరావు, సీనియర్ అడ్వకేట్ కూన కృష్ణారావు, జైలర్స్ వి.రమేష్ పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు విత్తనశుద్ధి అత్యవసరం

పోలవరం : మొక్కజొన్నలో సమగ్ర సస్యరక్షణలో భాగంగా విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని కృష్ణ విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్, హెడ్ డాక్టర్ పి.విజయలక్ష్మి సూచించారు. శనివారం ఐటిడిఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ జి.అనిల్ కుమార్ ఆధ్వర్యాన ఐటిడిఎస్ సంస్థ సహకారంతో మండలంలోరి వెంకట్రామన్నగూడెం గ్రామంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఇ.రేఖ కిచెన్ గార్డెన్ కిట్ల ప్రాముఖ్యతను, కూరగాయల నిర్వహణ పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు ఉచితంగా పంట పొలాల మందులు, స్ప్రేయర్లు పంపిణీ చేశారు.

వ్యవసాయ కేబుల్ వైర్ల దొంగల ముఠా అరెస్ట్

ముసునూరు : మండలంతో పాటు 10కిపైగా మండలాల్లో రైతుల వ్యవసాయ మోటార్లకు చెందిన సుమారు 400 కేబుల్ వైర్లను దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను(ఒక జువైనల్‌తో సహా) ముసునూరు ఎస్ఐ అరెస్ట్ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం, వ్యవసాయ కార్యకలాపాలకు అంతరాయం కలిగించిన ఈ ఘటనలను జిల్లా అధికారులు సీరియస్‌గా పరిగణించి, ఆయా ప్రాంతాల్లో గస్తీని పెంచాలని, ప్రత్యేక బృందాలను నియమించాలని ఆదేశించారు. పూజారి ప్రభు కుమార్, కర్రి వెంకట జస్వంత్, అబ్బు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా చెడు వ్యసనాలకు ఖర్చుల కోసం 11 మండలాల్లోని పొలాల్లో మోటార్ల కేబుల్ వైర్లను కత్తిరించి దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. దొంగిలించిన వైర్లను ఏలూరులోని మదీనా కాంప్లెక్స్‌లో స్క్రాప్ షాప్ నడుపుతున్న అబ్బు శ్రీనివాసరావు అనే వ్యక్తికి విక్రయించినట్లు వెల్లడించారు.

CHANGE OF NAME

I, **GUBBALA DURGA SRINIVAS** (New Name), S/o. Mariyya, Previously Called **GUBBALA SRINIVASA RAO** (Old Name), Resident of D.No.1-87/1, Maremma Gadde Veedhi, Mulaparru Village, Penugonda Mandal, W.G.Dt., Pin-534123, Andhra Pradesh. I have changed my name from **GUBBALA SRINIVASA RAO** (Old Name) To **GUBBALA DURGA SRINIVAS** (New Name) for all practical purposes.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరి దుర్గ భవాని భర్త సాయిబాబు డోర్ నెంబర్ 10-193 ఎన్ వి చెరువు కవిటం, పోడూరు మండలం పిన్కోడ్ నెంబర్ 534338. పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ప్రజలకు తెలియజేయడం ఏమనగా నేను విశాఖపట్నం పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి S 7077937 నెంబర్ గల పాస్పోర్ట్ పొందాను. కవిటం మా ఇంటి నుంచి పాలకొల్లు జిరాక్స్ సెంటర్కు నా పాస్పోర్టు ను జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్ పై వెళుతుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్పోర్ట్ పడిపోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైనా దొరికినచో పై నా అడ్రస్‌కు నా ఒరిజినల్ పాస్పోర్ట్ అందజేయగలరు.

సెల్ నెంబర్ 9704539061.

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.49/2024 in O.S.No.299/2025

Between:
మాఘం శ్రీనివాసరావు ...డిక్రీ హోల్డర్
And
బంగారు శ్రీనివాసుబాబు ...జడ్జిమెంట్ డెబ్టర్
To.
బంగారు శ్రీనివాసుబాబు, తండ్రి మాధవ మాణిక్యాలరావు, డోరునెం.17A-5-12, బంగారు వారి చెరువు గట్టు, పాలకొల్లు, పాలకొల్లు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు డిక్రీ బాకి అమలు గ్రంథములో జడ్జిమెంట్ డెబ్టర్ హాజరు నిమిత్తం ది.03-12-2025 సం॥తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పిటిషను ముందు గ్రంథము జరుపబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
పాలకొల్లు న్యాయవాది, పాలకొల్లు,
తేది.28-11-2025 పశ్చిమ గోదావరి జిల్లా.